ఓటమి అంచుల్లో బిజెపి

- ప్రజలు మార్పును కోరుకుంటున్నారు
- ఆ పార్టీ విధానాలతో జనం విసిగిపోయారు
- రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తారు
- యథేచ్ఛగా మతకల్లోలాలు, మానవ హక్కుల ఉల్లంఘన
- హైకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"భారతీయ జనతా పార్టీ ఓటమి అంచుల్లో కొట్టుమిట్టాడుతోంది. ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి సంపూర్ణ మెజార్టీ రాదు. ఆ కూటమికి గరిష్టంగా 250 సీట్లు కూడా దాటవు. దేశ వ్యాప్తంగా బిజెపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. దాని విధానాలతో దేశం విసిగి పోయింది. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. మరోసారి మోడీ సర్కార్ గద్దెనెక్కితే దేశానికే ప్రమాదకరం. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేస్తారు. మతకల్లోలాలు, మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతుంది. ఈ సారి ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రజలు కాషాయకూటమికి బుద్ధి చెప్పాలి" అని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ప్రశాంత్ భూషణ్ పిలుపు నిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని మదీనా ఎడ్యూకేషన్ సెంటర్లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, భారత్ జోడో అభియాన్ ఆధ్వర్యంలో "2024 ఎన్నికలు... ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం" అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు.

గత పదేళ్లుగా బిజెపి దేశాన్ని విధ్వంసం వైపు నడిపించింది. తనకు అనుకూలంగా లేని వ్యక్తులు, పార్టీలు, సంస్థలపై దాడులు చేయిస్తూ భయ భ్రాంతులకు గురి చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలంలో దర్యాప్తు సంస్థలు తమ ఉనికిని కోల్పోయాయని పేర్కొన్నారు. మనీ లాండరింగ్ కేసుల్లో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ఎవరినైనా అరెస్ట్ చేసే అధికారం ఉన్న నేపథ్యంలో దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని బిజెపి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. గత పదేండ్లలో విపక్షపార్టీలకు చెందిన 25 మంది నాయకులపై ఈ తరహా కేసులు నమోదయ్యాయి. అయితే వారందరూ తర్వాత బిజెపిలో చేరగా, అందులో 23 మందిపై కేసులు వీగి పోయాయని గుర్తు చేశారు. అప్రూవర్లు అనే పదాన్ని ఉపయోగించుకుని రాజకీయ అనుబంధాలకు అనుగుణంగా కేసులను మార్చుతూ దర్యాప్తు సంస్థల ఉనికిని మోడీ సర్కార్ ప్రశ్నార్థకంగా మార్చిందని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యం గానికి పెను ప్రమాదమని హెచ్చరించారు. ఎన్నికలకు ముందే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్ సోరెన్, ఎమ్మెల్సీ కవిత లాంటి వారిని ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. ప్రత్యర్థి పార్టీలు లేకుండా చేయడం ద్వారా ఆయా రాష్ట్రాల్లో లబ్ధి పొందేందుకు బిజెపి ఈ సంస్థలను వాడుకుంటోందని విమర్శించారు. నల్లధనాన్ని రూపు మాపేందుకే తీసుకొచ్చామని చెప్పిన ఎన్నికల బాండ్లు ప్రపంచంలోనే అతి పెద్ద కుంబకోణమని ఆరోపించారు. అధికారికంగా రూ.16 వేల కోట్లు వసూలు చేసినా..దీని మాటున లక్షల కోట్ల అవినీతి జరిగిందని విమర్శించారు. మేఘా ఇంజినీరింగ్ కంపెనీ, భారతీ ఎయిర్‌టెల్‌తో పాటు దేశంలోని అనేక ఫార్మా కంపెనీలు తమ కాంట్రాక్టులు, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు బాండ్లను కొనుగోలు చేశాయని చెప్పారు. బిజెపి దాటికి తట్టుకోలేక మీడియా, ఎన్నికల కమిషన్, దర్యాప్తు సంస్థలు అచేతనంగా మారిపోయాయని చెప్పారు. న్యాయ వ్యవస్థ కొన్ని కేసుల్లో మెరుగ్గా స్పందిస్తున్నా ఏళ్ల తరబడి న్యాయం కోసం వేచి చూసే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. "పైసాపే సత్తా, సత్తాపే పైసా అనే సైకిల్ సిస్టమ్ దేశంలో నడుస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు అమ్ముడు పోతున్నారు.

డబ్బులతో ప్రభుత్వాలు పడిపోతున్నాయి. పార్లమెంట్‌లో విపక్షాలను సస్పెన్స్ చేసి ఎలాంటి చర్చ లేకుండా చట్టాలు తెస్తున్నారు. ఇది దేశానికి ప్రమాదకరం." అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక కార్యకర్త నిర్మల భరధ్వాజ్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం ప్రశ్నించడాన్నీ నిషేదించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులు ప్రశ్నించకుండా ఉండేందుకు రెండు సార్లు ఆర్టీఐ చట్టంలో మార్పులు తెచ్చిందని గుర్తు చేశారు. ఎక్కడైతే పాలకుల తప్పులను అడిగే వారు లేకుండా పోతారో అక్కడ ప్రజాస్వామ్యం బతకదని హెచ్చరించారు. ప్రొఫెసర్ హరగోపాల్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సెమినార్‌లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కన్నెగంటి రవి, విస్సా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జహంగీర్‌ను గెలిపించాలి

- సిపిఎం, ఆవాజ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణకేంద్రంలో జహంగీర్ భార్య ఎండి ఖమరున్నీసా బేగం, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు ఎండి రేష్మాబేగం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా జహంగీర్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషిచేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని సమస్యల పరిష్కారం కోసం 30 రోజులు పాదయాత్ర నిర్వహించారన్నారు. భువనగిరిలో ధనబలం, ప్రజాబలం మధ్య పోటీ జరుగుతుందని చెప్పారు. భువనగిరి గడ్డపై సిపిఎంను గెలిపిస్తే ప్రజల పక్షాన పార్లమెంట్‌లో జహంగీర్ ప్రశ్నిస్తారని తెలిపారు. పదేళ్ల బిజెపి పాలనలో ప్రజాసమస్యలు పరిష్కరించడంలో ప్రధాని మోడీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎమ్‌డి సల్మాబేగం, రజియాబేగం, అర్షియా, రహీమా తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సియులో మూకదాడులు ఆపాలి

- దోషులను శిక్షించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు)లో గత వారం రోజులుగా ఎబివిపి నాయకత్వంలో మూకదాడులు చేస్తున్నారనీ, విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏడుగురు విద్యార్థినులతో సహా, 20 మంది విద్యార్థులు వీరి దాడిలో గాయపడ్డారని తెలిపారు. ఇద్దరు విద్యార్థినులతో సహా ఆరుగురు ఆస్పత్రుల్లో చేరాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల వాతావరణంలో సున్నితమైన అంశాలను ముందుకుతెచ్చి, రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే ప్రయత్నంలో ఒక పథకం ప్రకారమే దాడులు చేస్తున్నారని తెలిపారు. ఈ దాడులను సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు తక్షణం విచారణ జరిపి దోషులను శిక్షించాలనీ, విద్యార్థులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 13న జరిగిన వీడ్కోలు వేడుకల్లో ఎబివిపి కార్యకర్తలు వికలాంగుడైన హర్షరాజ్‌పై దాడి చేయడంతో, ఎస్ఎఫ్ఐ ఇతర సంఘాల నాయకులు సర్దుబాటుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. అనంతరం 17న ఒక పథకం ప్రకారం ఎస్ఎఫ్ఐ కార్యకర్త ఫైజల్‌పై దాడి చేసి విద్యార్థులను గాయపరిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాయపడిన వారిని అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలిస్తుండగా, దాన్ని కూడా ఈ మూక అడ్డుకున్నదని తెలిపారు. అమ్మాయిలను లైంగికంగా వేధించారనే విషయం వీడియోల్లో స్పష్టంగా కనబడుతున్నాయని పేర్కొన్నారు. సమస్యను లోతుగా విచారణ జరపకుండా పోలీసు అధికారులు దీన్ని రెండు విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణగా చూడటమేంటని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాల కోసం యూనివర్సిటీలో ఘటనను వాడుకునేందుకే ఎబివిపి ఒక పథకం ప్రకారం చిచ్చుపెడుతోందని తెలిపారు. గాయపడినవారినీ, దాడి జరగకుండా నివారించే ప్రయత్నం చేసిన వారిని కూడా కేసుల్లో ఇరికించి వేధిస్తున్నారని పేర్కొన్నారు. దాడికి గురైన బాధితులను బైండోవర్ చేస్తున్నారనీ, పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని తెలిపారు. పోలీసు అధికారులు వాస్తవాలు గమనించి, బాధితులను వేధించటాన్ని ఆపాలనీ, దోషులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులపై బైండోవర్ కేసులు ఎత్తివేయాలనీ, వేధింపులు ఆపాలనీ విజ్ఞప్తి చేశారు.

మూఢ నమ్మకాలపై కందుకూరి ధిక్కారం

ప్రజాశక్తి - కల్చరల్

ఎన్నో మూఢ నమ్మకాలు అశాస్త్రీయ విశ్వాసాలతో నిండి ఉన్న నాటి సమాజాన్ని ధిక్కరించిన కందుకూరి వీరేశలింగం సామాజిక సంస్కరణల ఉద్యమ కారులు అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ ఛైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు శ్రీత్యాగరాయ గాన సభలో కందుకూరి వీరేశలింగం సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్ పాల్గొని మాట్లాడుతూ.. నాడు చిన్న బాలికలకు వయస్సు మీరిన వారితో వివాహం జరిపించి వారు మరణిస్తే జీవిత కాలం అంతా ఆ స్త్రీ వితంతుగా వుండిపోయే అమానవీయ విధానంకు వ్యతిరేకంగా ఉద్యమించి వితంతు వివాహాలు జరిపించిన వీరేశలింగం మహిళల విద్య కోసం విశేష కృషి చేశారని వివరించారు పత్రికా సంపాదకులుగా రచయితగా సమాజంలో చైతన్యం కోసం జీవితం అంకితం చేసిన మహనీయుడు కందుకూరి అని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదికపై సాహితీ కిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, సామాజిక కార్యకర్త నైషధం సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొనగా పాలక మండలి సభ్యుడు బండి శ్రీనివాస్ ద్రావిడ వందన సమర్పణ చేశారు.

బాలభవన్‌కు పునర్వైభవం వచ్చేనా?

- నిధులేవి? సిబ్బంది కొరత తీరుస్తారా?
- తగ్గిపోతున్న పిల్లల నమోదు
- సౌకర్యాల లేమితో ఇబ్బందులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భావి భారత పౌరులైన పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీయాలి. పేద పిల్లల్లో నిబిడీకృతమై ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు పలు వేదికలు అవసరం. పేద పిల్లల్లో దాగున్న ప్రతిభకు సాన బెట్టేందుకే జవహర్ బాల భవన్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో జవహర్ బాలభవన్ డైరెక్టరేట్ నెలకొని ఉంది. అనేక సంవత్సరాలుగా కళకళలాడిన ఈ బాలభవన్ గత కొన్నేళ్లుగా క్రమ క్రమంగా తన విశిష్టతను కోల్పోతోంది. గత, ప్రస్తుత పాలకుల ఉదాసీనత దీనికి శాపంగా మారింది. పేద పిల్లల మానసిక వికాసానికి ఎంతో ఉపయోగపడుతున్న ఈ భవన్ నిర్వహణ కోసం నిధుల కేటాయించేందుకు ఆసక్తి చూపించకపోవడం, పూర్తి స్థాయి డైరెక్టర్‌ను కూడా నియమించకపోవడం, క్రమేణా నమోదు చేసుకుంటున్న పిల్లల సంఖ్య తగ్గిపోతున్నా... ఇలాంటివేమి ప్రభుత్వానికి పట్టకపోవడం తో సౌకర్యాల లేమితో బాలభవన్ కొట్టుమిట్టాడుతోంది.

1995 ప్రాంతంలో ఈ సెంటర్‌లో దాదాపు 3 వేల వరకు పిల్లల నమోదు ఉండేది. అది కాస్తా క్రమక్రమేణా తగ్గుతూ గత కొన్నేండ్లుగా వెయ్యి లోపునకు ఆ సంఖ్య పడిపోవడం పేద పిల్లలపై ప్రభుత్వాల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. గత పదేండ్లుగా జవహర్ బాలభవన్‌కు పూర్తి స్థాయి డైరెక్టర్‌ను కూడా నియమించకుండా ఇన్‌ఛార్జీలు, అదనపు బాధ్యతలతో సరిపెడుతూ వచ్చారు. దీంతో వారు కూడా పూర్తి స్థాయిలో బాలభవన్ కార్యక్రమాలపై దృష్టి సారించలేకపోతున్నారు. ఒక వైపు నిధులు ఇవ్వక, డైరెక్టర్‌నూ నియమించక, పదవీ విరమణ చేసిన వారి స్థానంలో కొత్త వారిని రిక్రూట్ చేయకుండా బాలభవన్‌కు ఆదరణ లేకుండా ప్రభుత్వాలే చేశాయనడంలో సందేహం లేదు. దీంతో కార్పొరేట్, ప్రయివేటు వికాస కేంద్రాల్లో తమ పిల్లలను చేర్పించే స్తోమతా లేని తల్లిదండ్రులు..... ఇటు బాలభవన్‌లో చేర్పించలేక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

గతంలో బాలభవన్‌లో భరతనాట్యం, కూచిపూడి, సైన్స్ ల్యాబ్, క్యారమ్స్, స్విమ్మింగ్, కరాటే, వీణ, మ్యూజిక్ తదితర అంశాలను బోధించేవారు. అయితే ఉపాధ్యాయుల కొరత కారణంగా తబల, కూచిపూడి, స్విమ్మింగ్, కరాటే, ప్లానిటోరియం, వీణ, డ్రామా, పేరిణి వంటివి పక్కన పెట్టినట్టు తెలుస్తున్నది. దీంతో అరకొర అంశాల్లో బోధన మాత్రమే పేద పిల్లలకు మిగిలింది. దీనికి తోడు కనీస వసతుల కల్పన, మౌలిక సదుపాయాలు లేకపోవడం కూడా ఇబ్బంది కలిగిస్తున్నది. కొన్ని సార్లు కేంద్రంలో తాగునీటికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని సిబ్బంది వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే వేసవి శిబిరాన్ని నిర్వహించేందుకు వారు సిద్ధపడుతున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఏదో అయిందనట్టుగానే శిబిరం నామమాత్రంగానే జరుగుతుందా? లేక ప్రభుత్వం పట్టించుకుని నిధులు కేటాయించి, బాలభవన్‌కు పూర్వపు ఉత్సాహాన్ని నింపుతుందో చూడాలి.

జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి

రాష్ట్రంలో ఆయా జిల్లాల్లో ఉన్న బాలభవన్, బాల కేంద్రాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నట్టు తెలుస్తున్నది. పది బాలభవన్లు, 12 బాల కేంద్రాలున్నప్పటికీ గతంలో కన్నా వాటిలో అత్యధికమైన వాటిలో జవహర్ బాలభవన్ డైరెక్టరేట్‌లో ఉన్న పరిస్థితులే ఉన్నాయని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఏడాదంతా విద్యా అంశాలతో బిజీగా ఉండి వేసవిలో ఉల్లాసాన్నిచ్చే అంశాల్లో శిక్షణ పొందే అవకాశమున్నా.. బాలభవన్‌లు, కేంద్రాలు నిరాదరణకు గురవుతున్నాయి. సరైన భవనాలు, శిక్షణా సామాగ్రి, సిబ్బంది కొరత, సదుపాయాల లేమిని తీర్చాలని తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అవసరాలను గుర్తిస్తున్నాం-డైరెక్టర్ ఎస్ విజయలక్ష్మి

జవహర్ బాలభవన్ రెగ్యులర్ శిక్షణతో పాటు వేసవి శిబిరం కోసం పిల్లలను ప్రోత్సహిస్తున్నట్టు జవహర్ బాలభవన్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. పిల్లల నమోదు కార్యక్రమం పూర్తయిన తర్వాత అవసరాల మేరకు బయటి నుంచి సిబ్బందిని రప్పించి వినియోగించు కుంటామని చెప్పారు. అన్ని విషయాలను పరిశీలిస్తున్నామనీ, శిబిరాన్ని మరింత బాగా నడిపించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మతోన్మాద బిజెపిని ఓడించాలి

- ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు

బహిరంగ సభలో మాట్లాడుతున్న డిజి నరసింహారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం మతోన్మాద బిజెపిని ఓడించి, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు అన్నారు. ఆదివారం సిపిఎం నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హీరా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పార్లమెంటు ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బిజెపి పాలనలో కార్పొరేట్, మతోన్మాద విధానాలు బలపడ్డాయని, వాటికి వ్యతిరేకంగా దేశంలో పోరాడింది వామపక్షాలేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం గుజరాత్‌లో 15 శాతం పైగా పేదరికం పెరిగగా, కేరళలో 0.7శాతం లోపలే ఉందని వెల్లడించారు. ఈ కేరళ మోడల్ నేడు దేశానికి అవసరం అని అన్నారు. శ్రమజీవులైన వ్యవసాయ కార్మికులు, రైతాంగం, కార్మికులు, కౌలు రైతులకు మేలు జరగాలంటే తిరిగి వామపక్ష అభ్యర్థులను గెలిపించుకోవడం వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. పార్లమెంట్‌లో వామపక్ష పార్టీలు లేకపోవడంతో.. రైతుల నల్లచట్టాలు, నూతన జాతీయ విద్యావిధానం, లేబర్ కోడ్లు, సిఎఎ లాంటి ప్రజా వ్యతిరేక చట్టాలను బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని అరన్నారు. యూపీఏ ప్రభుత్వంలో కమ్యూనిస్టులు భాగస్వామ్యమయినప్పుడు పార్లమెంట్‌లో ప్రజా అనుకూల చట్టాలు చేయించి, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పని చేశాయని తెలిపారు. అందుకే దేశ ప్రయోజనాల కోసం ఇండియా కూటమి అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, సుజాత, జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, తొడసం శంభు, ఇప్ప లక్షణ్, నిర్మల్ పట్టణ కార్యదర్శి ఫసియుద్దిన్, నాయకులు నాగెల్లి నర్సయ్య, పోశెట్టి, వెస్లీ, నవీన్, ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పిఎస్ 2013 అరియర్స్‌ను వెంటనే చెల్లించాలి

- రేపు " డిమాండ్స్ డే" ని పాటించండి ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికులకు ఆర్‌పిఎస్ 2013కు సంబంధించి ఇచ్చిన బాండ్ డబ్బులు రూ.281కోట్లను విడుదల చేస్తున్నామని ఫిబ్రవరి 10 న స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ వేదిక నుండి ప్రకటించినప్పటికీ ఇప్పటికీ వారికి ఆ డబ్బులు చెల్లించకపోవటమేంటని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) ప్రశ్నించింది. ఆ మొత్తాన్ని తక్షణమే చెల్లించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్‌పీఎస్ 2017 కు సంబందించిన అరియర్స్ లెక్కలు చేసి కార్మికులకు ఒక కాపీ ఇవ్వాలని, అదే కాపీని కేసులో ఫైల్ చేయాలని వారు కోరారు. 2017 అరియర్స్‌ను కార్మికులు రిటైర్‌మెంట్ సమయంలో కాకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ' డిమాండ్స్ డే ' ని పాటించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఆరోజు డిమాండ్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ అనుబంధాలకు అతీతంగా కార్మికులు ఈ పిలుపును జయప్రదం చేయాలని ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 2013 కు సంబంధించిన బాండ్ డబ్బులు కోసం అనేక విజ్ఞప్తుల అనంతరం ఏప్రిల్ -2 న కేవలం డ్రైవర్లకు చెల్లించారనీ, మిగిలిన క్యాటగిరీల్లోని 28 వేల మందికి ఎందుకు చెల్లించలేదో ఇంత వరకు ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం ప్రకటించ లేదని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆఫీసు బేరర్ల సమావేశంలో డిమాండ్స్ డే పై నిర్ణయాన్ని ప్రకటించారు. వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు కె. గంగాధర్, కెఎస్ రెడ్డి, ఎవి రావు, కార్యదర్శి చంద్ర ప్రకాష్, ప్రచార కార్యదర్శి . రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
ఐ.ఏ. నెం. 1214/2022
ఐ.ఏ. నెం. 1911/2021
ఏ.యస్.యస్.ఆర్. నెం. 7824/2021
పార్టీలు:
బాణాల రాధ -పిటీషనరు
మరియు
కేతినీడి అనిల్‌కుమార్, వగైరా -రెస్పాండెంట్లు
2. మొండి విజయకుమారి, భర్త: చిన్నారావు, డోరు నెం. 8-1-396/ఎ/2-యఫ్1, 4వ అడ్డ రోడ్డు, షేక్ పేట దర్గా, ద్వారకానగర్, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
పై పిటీషనరు పై అప్పీలు దాఖలు చేయుటలో జరిగిన జాప్యము క్షమించమని దాఖలు చేసుకున్న పై పిటీషనులో వారసులను చేర్చమని వేసిన పిటీషనులో ఎన్నిమార్లు నోటీసులు పంపించిన మీరు తీసుకోనందున మీ హాజరు నిమిత్తము పై కోర్టులో ది. 02-5-2024వ సం॥రం తేదీకు వాయిదా అయివున్నది. కావున పై కోర్టు ఎదుట ది. 02-5-2024వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములను తెలియపర్చుకోగలరు. లేని యెడల పై పిటీషను మీ పరోక్షమున నిర్ధారింపబడును.
ఎం.ఆర్.సత్యసాయి
అడ్వకేట్, రాజమహేంద్రవరం

ఎట్టకేలకు మెట్రో మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్!

- ఆరేండ్ల తర్వాత నాంపల్లిలో 'ఎంఎల్‌పి' అందుబాటులోకి
- ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మెట్రో ఎమ్‌డి పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ (ఎంఎల్‌పి) పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. మెట్రో రైలు తొలినాళ్లలో అంటే దాదాపు ఆరేండ్ల క్రితం ఎంతో ప్రతిష్టాత్మకమైన మల్టీ లెవల్‌కార్ పార్కింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి సంబంధించిన భూమి పూజను అప్పటి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, హైదరాబాద్ మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డితో కలిసి నిర్వహించిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నాంపల్లిలో సుమారు అర ఎకరం స్థలంలో పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) విధానంలో రూ.80 కోట్లతో ఎంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ 15 అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. మిగిలిన పనులను త్వరతగతిన పూర్తిచేసి.. నెల రోజుల్లో ట్రయల్ రన్ నిర్వహించేలా మెట్రో అధికారులు కసరత్తు చేస్తున్నట్టు మెట్రో ఎండి ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఎంఎల్‌పికి సంబంధించిన పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మెట్రో ఎండీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఆధునిక పార్కింగ్ కాంప్లెక్స్ మన నగర కీర్తికిరీటంలో మరో కలికితురాయి కాగలదని అన్నారు. దేశంలో నూతన పార్కింగ్ విప్లవానికి ఈ ప్రాజెక్టు నాంది పలికిందని తెలిపారు. పీపీపీ విధానంలో రూ.80కోట్ల ప్రాజెక్టు నిర్మాణంతో దేశంలోనే ప్రప్రథమంగా జర్మన్ పాలిస్ పార్కింగ్ విధా నంలో.. తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేసేలా ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు చెప్పారు

ఫాసిజం కేన్సర్ లాంటిది

- అది భావానికి సంబంధించిన అంశం
- మూఢత్వంలోకి నడిపిస్తున్న శక్తుల్ని నిలువరించాలి
- ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్
- అన్యాయం స్థిర కాలం రాజ్యమేలదు
- మోడీ కూడా అంతే : కవి శివారెడ్డి
- జయప్రదంగా కవి గాయక సమూహగానం

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫాసిజమనేది కేన్సర్‌లాంటిదని, అది క్రమంగా కొంచెం కొంచెంగా విస్తరిస్తుందని ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఒకటో దశ, రెండో దశ ఇలా దశలవారీగా ఉంటుందనీ, ఒక్కో సారి నాలుగో దశవరకు దాని ప్రభావం తెలీదని ఆయన చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పసునూరి రవీందర్ అధ్యతన 'ప్రజాస్వామిక, లౌకిక, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కలం, గళం ఎత్తుదాం' అనే అంశంపై కవి గాయక సమూహగానం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వంద మందికిపైగా కవులు, రచయితలు, గాయకులు హాజరయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు 12 సెషన్లుగా కార్యక్రమం నడిచింది. 'ప్రమాదంలో పడ్డ ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, విజృంభించే అవకాశమున్న మనువాదం, దానికి అత్యంత బాధితులుగా ఉన్న దళితులు, స్త్రీలు, మైనారిటీలు, ఆదివాసీలు, బిసిలు, సెక్యులరిజం -రాజ్యాంగ రక్షణ, మత సామరస్యం వంటి ఎన్నో అంశాలమీద కవితా గానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామిక, లౌకిక, రాజ్యాంగ విలువలను పరిరక్షించుకోవాలని ఆలోచించటమే ప్రస్తుత పరిస్థితుల్లో ఒక ప్రత్యేకతన్నారు. వాస్తవంగా రాజ్యాంగం, లౌకిక విలువలు, మనువాదం, ఫాసిజం తదితర మాటలు సృజనాత్మక సాహిత్యంలో అంతగా ఇమిడేవి కావన్నారు. కవిత్వం తన స్వభావం కాని అనేక విషయాల గురించి ఇప్పుడు మాట్లాడాల్సొస్తుందనీ, సృజించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పుడు ఫాసిజం, నియంతృత్వం గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు. ఫాసిజమనేది ఎక్కడో బయట ఉండదన్నారు. 'దాన్ని రాకుండా చేయాలి. దాన్ని ఖండించాలి. దాన్ని చంపాలి. తరిమేయాలి' అనే నినాదాలిస్తాం. కానీ..అదో దుర్మార్గమైన చట్టం కాదు, ఒక సంఘటన కాదని చెప్పారు. ఇది ఒక దుర్మార్గపు భావాజాలమనే విషయాన్ని అందరూ గుర్తించాలని సూచించారు. దాన్ని ఎదుర్కోవటమెలా? అని ఆలోసించాలని కోరారు. అది డౌన్ డౌన్ అంటే పోయేది కాదని చెప్పారు. అదోక ప్రక్రియ అన్నారు. కొంచెం కొంచెంగా క్రమంగా వస్తుందన్నారు. దీన్ని భావాజాల పరంగానే ఎదుర్కోవాలని సూచించారు. ప్రముఖ కవి శివారెడ్డి మాట్లాడుతూ అన్యాయం స్థిర కాలం రాజ్యమేలద న్నారు. అదే తరహాలో మోడీ కూడా ఎల్ల కాలం ఉండలేడన్నారు. పసునూరి రవీంద్ర మాట్లాడుతూ 'దేశం ఇప్పుడు చెరబడ్డ పక్షి' అనే శీర్షికతో కూడిన కవిత ద్వారా కవిగాయక సమూహగానాన్ని ప్రారంభించారు.

'అహంకారం తలకెత్తుకున్నాక
ఈ దేశం మా సొత్తు అనే పొగరు
ఎవరి కాలును నేల మీద
నిలవనీయడం లేదు
చూస్తుండగానే దేశం
మధ్యయుగం బాట పట్టింది' అంటూ దేశంలో కొనసాగుతున్న దుర్మార్గాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు.

మహారాజ శ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు
(జూనియర్ డివిజన్) :: నంద్యాల
O.S. NO.636/2022
ది కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్ నంద్యాల రిప్రజెంటెడ్ బై సీనియర్ బ్రాంచ్ మేనేజర్. ...వాది
వర్సెస్
1. అంబటి హైమావతి వయసు 63 సం.భర్త హనుమంతరావు, వ్యవసాయం, H. No. 3-148, A.శివరాంపురం గ్రామం, జిల్లెల్ల పోస్ట్, గోస్పాడు మండలం నంద్యాల జిల్లా. cell no. 9000212336.
2. A.S శ్యాంప్రసాద్ వయసు 43 సం॥ తండ్రి హనుమంతరావు, ప్లాట్ నెం.401 ఫ్లాట్ నెం. 55 / 57 ఈస్ట్ విల్ల, బాలాజీ నగర్, నిజాంపేట్, హైదరాబాద్, cell no.9440001171. ... ప్రతివాదులు
2వ ప్రతివాది కి దావా సమన్సు
పై దావా నందు వాది ప్రతివాదులు పై దావా దాఖలు చేసి ఉండి క్రాప్ లోన్ దావా మొత్తం రు. 1,94,861/- డబ్బులు రాగోరి ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను మీరు ఉద్దేశపూర్వకంగా తీసుకోనందున కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ: 26-4-2024 న ఉదయం. 10.30 గంటలకు మీరు గానీ మీ తరఫు వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. మీరు హాజరుకాని పక్షంలో ని పరోక్షంగా తీర్మానించబ డునని మీకు తెలియజేయడమైనది
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేదీ. 26-4-2024
ఇట్లు
T.V. ప్రసాద్,
బి.కాం,బి.యల్
వాది పరం అడ్వకేట్,
సంజీవ నగర్,
నంద్యాల

ప్రజాస్వామ్య రక్షణకు బిజెపి కూటమిని ఓడించాలి

- వామపక్షాలు గెలిస్తేనే పార్లమెంటులో ప్రజావాణి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ప్రజాస్వామ్యం రక్షించబడాలంటే బిజెపి కూటమిని ఓడించి, వామపక్ష, లౌకిక శక్తులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం ఎన్నికల ప్రచారంలో భాగంగా జనగామ జిల్లా సిద్దెంకి గ్రామంలో భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండి జహంగీర్‌ను ఆదరించాలని కోరుతూ నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. అప్పుడే పార్లమెంట్‌లో ప్రజావాణిని వినిపించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గడం వల్ల ప్రజా సమస్యలు పక్కకు పోయి కార్పొరేట్లకు ఉపయోగపడే విధానాలు ముందుకు వస్తున్నాయని ఆరోపించారు. పదేండ్ల బీజేపీ పాలనలో కార్పొరేట్, మతోన్మాద విధానాలు బలపడ్డాయని, వీటికి వ్యతిరేకంగా నికరంగా పోరాడింది దేశంలో వామపక్షాలే అని స్పష్టంచేశారు. వామపక్ష అభ్యర్థులు గెలిస్తే ప్రజా అనుకూల ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తేవడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. నరేంద్ర మోడీ గుజరాత్ మోడల్ అని చెబుతున్న గుజరాత్‌లో కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 15 శాతం పైగా పేదరికం పెరిగిందని తెలిపారు. ఆర్థిక నిపుణుల అంచనా ప్రకారం ఇది 30శాతంకు పైగా ఉంటుందని అన్నారు. కానీ, కేరళలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 0.7శాతం లోపలే పేదరికం ఉందని పేర్కొనడం, ఉపాధి, ఉద్యోగ కల్పన, మానవ అభివృద్ధి, అందరికీ నివాసం కల్పించిందని ప్రభుత్వ నివేదికలే చెబుతున్నాయని అన్నారు. వ్యవసాయ కార్మికులు, రైతాంగం, కార్మికులు, కౌలు రైతులకు మేలు జరగాలంటే తిరిగి వామపక్ష అభ్యర్థులను గెలిపించుకోవడమే మార్గమని చెప్పారు. దేశంలో బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అమ్ముతుంటే వాటిని కేరళ ప్రభుత్వం తీసుకుని ప్రభుత్వ రంగంలో నడుపుతున్నదని తెలిపారు. దేశంలో రైతుల నల్లచట్టాలు, నిరుద్యోగ సమస్య, నూతన జాతీయ విద్యావిధానం, కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను, సిఎఎ లాంటి ప్రజా వ్యతిరేక చట్టాలు కార్పొరేట్ శక్తులకు ఉపయోగం కలిగేలా తీసుకొస్తే, వాటికి వ్యతిరేకంగా సిపిఎం పోరాడుతోందని తెలిపారు. పార్లమెంట్‌లో వామపక్ష పార్టీలు లేకపోవడం వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం జరిగిందో ప్రజలు ఆలోచిస్తున్నారని తెలిపారు. యుపిఎ మొదటి ఐదేళ్లలో ప్రభుత్వం ఉన్నప్పుడు కమ్యూనిస్టులు పార్లమెంట్‌లో ఉండడం వల్ల ప్రజా అనుకూల చట్టాలు చేయించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేశారని తెలిపారు. దేశాన్ని కార్పొరేట్, మతోన్మాద విధానాలతో నష్టం చేస్తున్న బిజెపిని రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు పుప్పాల శ్రీకాంత్, జనగామ జిల్లా కమిటీ సభ్యులు జోగు ప్రకాశ్, గ్రామశాఖ కార్యదర్శి గురిజాల లక్ష్మినర్సింహారెడ్డి, నాయకులు పుప్పాల అయిలయ్య, విప్లవ రెడ్డి, నర్సయ్య, దుబ్బాక సంపత్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో భాగంగా జహంగీరిని గెలిపించాలంటు ఓ కుటుంబ సభ్యులను కోరుతున్న ఎండి అబ్బాస్

సమతుల ఆహారంతోనే ఆరోగ్యం

- న్యూట్రిషన్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి

హైదరాబాద్ : సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటానికి ఆరోగ్య కరమైన, సమతుల ఆహారంపై దష్టి పెట్టాలని న్యూట్రీషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి సూచించారు. సీజన్లు మారుతున్న వేళ, మీ రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. ఇందుకోసం రోజువారీ భోజనంలో బాదం, సీజనల్ పండ్లు, కూరగాయలు వంటి సహజమైన ఆహారాలను జోడించడం ముఖ్యమని ఆమె ఓ ప్రకటనలో తెలిపారు. బాదంపప్పులు కేవలం రుచికరమైనవి మాత్రమే కాదని వాటిలో విటమిన్ ఇ, జింక్, ఫోలేట్, ఐరన్ వంటివి ఉంటాయన్నారు. నారింజ, నిమ్మ, ముసాంబి, ద్రాక్షపండు వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుందన్నారు వెల్లుల్లి యాంటీ బాక్టీరియల్ లక్షణాలకు ఇది ప్రసిద్ధి చెందిందన్నారు. బచ్చలికూర, మునగ ఆకులు, ఉసిరి ఆకులు, పుదీనా, ఇతర ఆకు కూరలు రోగనిరోధక పనితీరులో కీలక పాత్ర పోషించే విటమిన్లని, యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాటయన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అశ్విన్ కుమార్

దృఢమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సిఎంఎ పాత్ర కీలకం

- ఐసిఎంఎఐ అధ్యక్షులు అశ్విన్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్

దృఢమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ (సిఎంఎ) పాత్ర ఎనలేనిదని ఐసిఎంఎఐ అధ్యక్షుడు సిఎంఎ అశ్విన్‌కుమార్ జి దళవాడి అన్నారు. ప్రభుత్వం, విధాన నిర్ణేతలు, పరిశ్రమలు, కార్పొరేట్ ప్రపంచానికి సిఎంఎలు బలమైన శక్తిగా ఉన్నారన్నారు. హైదరాబాద్‌లో అశ్విన్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ పాత్ర పూర్తిగా రూపాంతరం చెందిందన్నారు. వ్యాపార కార్యకలాపాలలో నిర్ణయాత్మక పాత్రను పోషిస్తున్నారని చెప్పారు. సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడానికి, కార్పొరేట్ అనుకూల విధానాలు, పథకాలను సూచించడానికి వీలు కల్పిస్తుందన్నారు. సిఎంఎలు తమ కార్యకలాపాలు, అంతర్గత నియంత్రణలు, పాలనా ప్రక్రియలు, రిస్క్ మేనేజ్‌మెంట్, నియంత్రణ వ్యవస్థల సమర్థత, ప్రభావాన్ని మూల్యాంకనం చేయడం ద్వారా సంస్థలకు సహాయం చేస్తున్నాయన్నారు. చాలా వ్యాపారాలు అస్థిరత, అనిశ్చితి, సంక్లిష్టత, అస్పష్టత తదితర అంతరాయాలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. సిఎంఎలు అన్ని ఆర్థిక కార్యకలాపాలలో చోదక శక్తిగా పనిచేస్తాయన్నారు. మార్కెట్ రిస్క్, క్రెడిట్ రిస్క్, ఆపరేషనల్ రిస్క్ వంటి సంస్థలు ఎదుర్కొంటున్న ఆర్థిక నష్టాలను సిఎంఎలు అంచనా వేస్తాయన్నారు. సిఎంఎ కోర్సు మన దేశంలో అత్యంత ఆకర్షణీయమైన వృత్తిపరమైన అర్హతలలో ఒకటన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఎంఎఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు కెసిహెచ్ఎవిఎస్ఎన్ మూర్తి, ఐసిఎంఎఐ చైర్‌పర్సన్ హైదరాబాద్ చాప్టర్ సిఎంఎ హిమ విద్యా సనగవరపు తదితరులు పాల్గొన్నారు.

విజయాన్ని మీ తలకెక్కనివ్వొద్దు

- డెన్వర్ ప్రచారంలో షారూఖ్

హైదరాబాద్ : ప్రముఖ సుగంధ పరిమళాల కంపెనీ డెన్వర్ బాలీవుడ్ నటుడు షారూఖ్ ఖాన్‌తో కొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. ఇందులో విజయాన్ని మీ తలకెక్కనివ్వద్దంటూ సూచన చేశారు. ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూడడం ప్రాముఖ్యతను ఇందులో నొక్కి చెబుతున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. విజయవంతమైన వ్యక్తులు తమ వినయాన్ని ఎలా కొనసాగించాలో సూచిస్తుందని హోమిల్టన్ సైన్సెస్ ఎండి, సిఇఒ సౌరభ్ గుప్తా తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి బిఆర్ఎస్, బిజెపిలకు బుద్ధి చెప్పాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఐఎన్‌టియుసి మహాసభ, కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ సన్నాహక సభ ఆదివారం గోదావరిఖనిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కోల్ బెల్ట్ వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో కార్మిక లోకం బిఆర్ఎస్‌కి బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. అదే విధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను మరింత భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానికంగా ఉన్న పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మాజీ కేంద్ర మంత్రి స్వర్గీయ వెంకటస్వామి కాక ఆశయాలతో వస్తున్నారని, వారిని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సింగరేణికి కొత్త బొగ్గు గనుల ఏర్పాటు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి.సంజీవ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతలరాజేష్‌తోపాటు కాంగ్రెస్, ఐఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో విద్యార్థులపై దాడి

- హెచ్‌సియులో అకడమిక్ వాతావరణాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఎబివిపి
- ఎస్ఎఫ్ఐ దాడిచేసినట్టు చిత్రీకరణ
- పోలీసులు నిష్పక్షపాత విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి
- తక్షణమే అడ్మినిస్ట్రేషన్ స్పందించి దాడిచేసిన వారిని సస్పెండ్ చేయాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎబివిపి నాయకులు హెచ్‌సియులో అకడమిక్ వాతావరణాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని, మద్యం మత్తులో విద్యార్థులపై దాడి చేసి, గాయాలు చేసుకొని ఎస్ఎఫ్ఐ దాడిచేసినట్టు చిత్రీకరిస్తున్నారని, పోలీసులు నిష్పక్షపాత విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షిం చాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎబివిపి దాడిలో గాయపడిన విద్యార్థులు మెహిత్, ఆషిక, ఖాయినీ, ఫైజల్‌తో వారు పాల్గొని మాట్లాడారు. ఏప్రిల్ 13వ తేదీ ఎకనామిక్స్ డిపార్టుమెంట్స్ ఫెర్వెల్ పార్టీ జరుగుతున్న సందర్భంలో ఎబివిపికి చెందిన కొందరు మద్యం మత్తులో అల్లరి చేస్తూ పాటల విషయంలో గొడవ చేస్తుంటే విద్యార్థులు ఘటనలో దివ్యాంగుడైన స్కాలర్‌పై అకారణంగా దాడి చేశారని, దీంతో తిరిగి 17వ తేదీన తన రూమ్‌లోకి వెళ్తున్న ఫైజల్ అనే విద్యార్థిపై విచక్షణా రహితంగా దాడి చేసి, గొంతు నులిమి బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఎబివిపి నాయకులు విద్యార్థులను బెదిరింపులకు గురి చేయటం, జే హాస్టల్స్ దగ్గర దాడి చేస్తుంటే అడ్డుకున్న ఇతర విద్యార్థులపైనా హాకీ స్టిక్స్‌తో దాడి చేయడం, అమ్మాయిలు దాడులను అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిని లైంగిక వేధింపులకు గురిచేయడం లాంటి ఘటనలు యూనివర్సిటీలో చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ దాడిలో పది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఈ అంశాలను పోలీసుల దృష్టికి తీసుకెళ్ళినా.. వారు సరిగ్గా విచారణ చేయకుండా రెండు గ్రూపుల మధ్య ఘర్షణగా చిత్రీకరిస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరిపై కేసులు అంటూ బైండోవర్స్ చేస్తున్నారని, పోలీసులు ఈ ఘటనలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఎస్ఎఫ్ఐని విద్యార్థులు ఎన్నికల్లో గెలిపిస్తూ ఆదరిస్తున్నారనే అక్కసుతో సాధారణ విద్యార్థులపై ఎబివిపి వాళ్లు దాడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎబివిపి వాళ్లను యూనివర్సిటీ అధికారులు హెచ్చరించి వారిని యూనివర్సిటీ నుంచి రస్టికేట్ చేయాలని, అప్పటివరకు పోరాడతామని స్పష్టంచేశారు. ఎబివిపి చేస్తున్న ఈ చర్యలు వ్యతిరేకంగా క్యాంపస్‌ను కాపాడుకునేందుకు విద్యార్థులు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు శివదుర్గారావు, హెచ్‌సియు విద్యార్థి అధ్యక్షులు అతీక్, కార్యదర్శి కృపాజార్జ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జూనుగరి రమేష్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రామాలయ నిర్మాణంతో సమస్యలన్నీ పోయాయా?

- మార్కెట్ చేసుకుని మోడీ లీడరయ్యారు
- రాహుల్‌గాంధీ ఓ ఫైటర్
- విలేకర్ల ఇష్టాగోష్టిలో జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అయోధ్య రామాలయ నిర్మాణంతో దేశంలోని సమస్యలన్నీ పోయాయా? అంటూ టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి బిజెపి నేతలను ప్రశ్నించారు. గుళ్లు కడితే ఉద్యోగాలు వస్తాయా? అని నిలదీశారు. సోషల్ మీడియాను మార్కెటింగ్ చేసుకుని మోడీ లీడరయ్యారని ఎద్దేవా చేశారు. మోడీ ఎక్కడా పోరాటం చేయలేదనీ, ఆయన సీల్డ్ కవర్‌లో గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు. రాహుల్‌గాంధీ ఫైటర్ అనీ, ఆయనకు మోడీకి పోలికే లేదన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాముడి ఆదర్శాలను నిలబెట్టే వ్యక్తి రాహుల్ గాంధీ మాత్రమేనని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. పేదల కోసం రాముడు పాలన చేశారని గుర్తు చేశారు. అయోధ్య గుడి నిర్మిస్తే తాను సంతోషిస్తానంటూ రాముడు అన్నారా? అని బీజేపీ నేతలను ప్రశ్నించారు. ఆ పార్టీ నేతలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, బండి సంజయ్‌లు రాజకీయంగా బతకాలంటే, జై శ్రీరామ్ అనకతప్పదని ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ చరిత్ర తెలియని బిజెపి నేతలు ఆయన రాజకీయ జీవితం మీద వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజకీయాలు రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి నరేంద్రమోడీ చుట్టే తిరుగుతున్నాయని తెలిపారు. బిజెపి సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రథయాత్రకు ముందు దేశానికి, గుజరాత్‌కు మోడీ ఎవరో కూడా తెలియదన్నారు. ఆ యాత్ర పూర్తి అయ్యాక.. గుజరాత్ ఎన్నికల్లో మోడీ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అద్వానీ సీల్డ్ కవర్‌లో ఆయన్ను సిఎంగా ప్రకటించారని గుర్తు చేశారు. ఇది నిజం కాదని బిజెపి నేతలు చెప్పగలరా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కూడా చాలా రాష్ట్రాల సిఎంలను సీల్డ్ కవర్‌లో డిసైడ్ చేశారన్నారు. కానీ సీఎంలను డిసైడ్ చేసే రాహుల్ గాంధీకి, సీల్డ్ కవర్ సిఎం మోడీకి చాలా తేడా ఉందని చెప్పారు. మోడీ ప్రధాని కాకముందు ఏ పోరాటం చేశారో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన అధికారం కోసం మాత్రమే రాజకీయాల్లోకి వచ్చిన నాయకుడు కానీ ప్రజల నుంచి వచ్చిన లీడర్ రాహుల్ గాంధీ అని ఈ సందర్భంగా జగ్గారెడ్డి వివరించారు.

టిఆఎస్ఆర్‌జెసి సెట్‌కు 61,442 విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ (టిఎస్ఆర్‌జెసి) జూనియర్ కాలేజీల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్షకు 84 శాతం మంది విద్యార్థులు హాజరయినట్టు ఆ సంస్థ కార్యదర్శి రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఏడాదికి గాను 35 గురుకుల కాలేజీల్లో ప్రవేశానికి రాష్ట్ర వ్యాప్తంగా 309 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్టు తెలిపారు. మొత్తం 73,528 మంది విద్యార్థులు ధరఖాస్తు చేసుకోగా 61,442 మంది విద్యార్థులు హాజరయినట్టు వెల్లడించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు తెలిపారు.

టెట్‌కు 2,86,386 మంది దరఖాస్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ స్టేట్ టీచర్స్ ఎల్జిబిలిటి టెస్ట్-2024కు మొత్తం 2,86,386 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పేపర్ 1 కోసం 99,958, పేపర్ 2 కోసం 1,86,428 మంది దరఖాస్తు చేసుకున్నారు.

మతోన్మాద బిజెపి, ఎంఐఎంలను కలిసికట్టుగా ఓడిద్దాం

- కూనంనేనితో డిడ్డి సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇండియా అలయెన్స్‌లోని పార్టీలన్నీ కలిసికట్టుగా బిజెపి, ఎంఐఎం పార్టీలను ఓడించాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు. ఆదివారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఆయన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో భేటీ అయ్యారు. ఇండియా అలయెన్స్‌లోని పార్టీలన్నింటినీ ఒక వేదికగా తీసుకొచ్చి ప్రజా సంఘాల సమావేశాలు, సదస్సులతో చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అవినీతికి పాల్పడిన బిజెపివిధానాలను ఎండగడతామని చెప్పారు.

ఘనంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎరోనాటికల్ ఇంజనీరింగ్ కాలేజీ వార్షికోత్సవం

హైదరాబాద్ : ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎరోనాటికల్ ఇంజనీరింగ్ కాలేజీ వారికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్పందన 2024 పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ కాలేజీ ఛైర్మన్, మల్కాజిగిరి ఎంఎల్ఎ రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సత్తి రెడ్డి, ప్రిన్సిపల్ ఎల్‌వి నరసింహ ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశంలో గిగ్ వర్కింగ్‌కు డిమాండ్

- వాహన్ టెక్నాలజీస్ హెడ్ సిద్ధార్థ్

హైదరాబాద్ : దేశంలో గిగ్ వర్కింగ్‌కు డిమాండ్ పెరుగుతుందని వాహన్ టెక్నాలజీస్ సంస్థ సహ్తే, అక్విజిషేన్ హెడ్ సిద్ధార్థ్ చౌహన్ తెలిపారు. ఈ రంగంలో నియామకాలు పెరుగుతున్నాయన్నారు. ఖోస్లా వెంచర్స్, ఎయిర్‌టెల్ వంటి పెట్టుబడిదారుల మద్దతు కలిగిన వాహన్ టెక్నాలజీస్ హైదరాబాద్‌లో బ్లూ కాలర్ రిక్రూట్‌మెంట్‌పై ఒక సెమినార్‌ను నిర్వహించింది. ఫుడ్ డెలివరీ, క్విక్ సర్వీస్, ఇ-కామర్స్, తయారీ వంటి పరిశ్రమల నుండి పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఆ రంగాల్లో నియామకాలపై దృష్టి సారించినట్లు సిద్ధార్థ్ తెలిపారు. బ్లూ కాలర్ ఉపాధిలో సవాళ్లను పరిష్కరించడం, కార్మికులకు ఉపాధి కల్పించడంపై దృష్టి కేంద్రీకరించామన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులకు తాము కొన్ని గంటల్లో ఉద్యోగాన్ని ఎలా అందించామో ఆయన వివరించారు.

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నంకు యత్నించిన సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కర్కపెల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా పరకాల పరిధికి చెందిన వివాహిత పల్లెబోయిన శ్రావణి గణపురం మండలం కర్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తోంది. మండలంలోని గాంధీనగర్‌లో కిరాయి ఇంట్లో తన భర్త, పాప, బాబుతో కలిసి జీవనం సాగిస్తోంది. కాగా శ్రావణి భర్త ములుగు జిల్లా పరిధిలో ఓ ప్రయివేట్ కంపెనీలో పని చేస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే కిరాయికి ఉంటున్న ఇంట్లోనే శ్రావణి ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబీకులు ఆమెను వరంగల్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. కాగా కర్కపల్లి గ్రామంలో శ్రావణికి మంచి పేరుంది. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రావణి ఆత్మహత్యాయత్నానికి ఆర్థిక ఇబ్బందులా..? లేక పని ఒత్తిడా..? తెలియాల్సి ఉంది.

యథేచ్ఛగా 'బెరైటిస్' అక్రమ రవాణా!

- రాత్రిపూట తరలింపు.. అధికారుల నిర్లక్ష్యం
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లాలోనే ప్రాధాన్యత సంతరించుకున్న తెల్ల రాయి (బెరైటిస్) ఖనిజం నిల్వ ఉన్న ప్రాంతం గార్ల మండలం. మండల కేంద్రానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో బాలాజీ తండా, కోట్యానాయక్ తండా పంచాయతీల సమీపంలో సుమారు 1000 ఎకరాల్లో తెల్ల రాయి ఖనిజం నిల్వ ఉన్న అటవీ ప్రాంతం. కొన్ని దశాబ్దాల కాలం పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన కొందరు పెత్తందార్లు.. కొంతమంది గిరిజనులను బినామీలుగా చూపి నాటి ప్రభుత్వం అండదండలతో బైరటిస్ తవ్వకాలు ముమ్మరంగా జరిపి కోట్ల రూపాయలు దండుకున్నారు. బెరైటిస్ ఖనిజాలు నిల్వ ఉన్న ప్రాంతం అటవీ శాఖ పరిధిలో ఉందని, తవ్వకాలకు అటవీశాఖ అనుమతులు లేవని 12 ఏళ్ల కిందట అనుమతులు నిలిపివేశారు. ఈ క్రమంలో గతంలో తవ్వకాలు జరిపి నిల్వ ఉన్న బెరైటిస్ రాళ్లను తరలించకుండా అటవీశాఖ అధికారులు అక్రమ రవాణాకు వీలు లేకుండా ట్రెంచ్ కొట్టించడం వంటి నియంత్రణా చర్యలు చేపట్టారు. కానీ, బెరైటిస్ రాళ్లను గతంలో లీజుకు తీసుకున్న సమయంలో సబ్ కాంట్రాక్టర్‌గా పని చేసిన ఓ కీలక వ్యక్తి.. రాజకీయ పార్టీ నాయకులు, సంబంధిత శాఖ అధికారుల అండదండలతో రాత్రి సమయంలో గుట్ట రాళ్లను ఖమ్మంలోని ఓ ప్రాంతానికి రాత్రి సమయంలో ట్రాక్టర్లు, లారీల ద్వారా మూడో కంటికి కనిపించకుండా అక్రమంగా రవాణా చేస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటు న్నారని సమాచారం. బెరైటిస్ రాళ్లను తరలించడానికి ఎలాంటి వీలు లేదని అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెప్పుతున్నారు. కానీ 40-50 కిలోమీటర్ల దూరం నుండి ట్రాక్టర్లు, లారీలు అర్ధరాత్రులు బెరైటిస్ గుట్ట ప్రాంతానికి వచ్చి పట్టు పడుతుండటంతో ప్రభుత్వ అధికారుల పాత్రపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు...

గతేడాది లారీలో అక్రమంగా బెరైటిస్ రాళ్లను తరలిస్తున్న లారీని స్థానిక పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి భూగర్భ గనుల శాఖ అధికారులకు అప్ప గించారు. సంబంధిత అధికారులు జరిమానా విధించగా సదరు అక్రమదారులు చెల్లించడం గమనార్హం. ఇటీవల రాత్రి సమయంలో బెరైటిస్ గుట్ట నుంచి తెల్ల రాయిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరు మధ్యలోనే మరమ్మత్తులకు గురి కాగా మార్గమధ్యలో తెల్ల రాయిని దిగుమతి చేసిన ఘటన ఉంది. కొన్ని నెలల క్రితం బెరైటిస్ రాళ్లను అక్రమంగా తరలించేందుకు అర్ధరాత్రి బెరైటిస్ గుట్ట వైపు వెళ్తున్న ఓ ట్రాకర్.. పినిరెడ్డిగూడెం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టగా పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా ఖమ్మంకు చెందిన ట్రాక్టరని తేలింది. అసలు అర్ధరాత్రి వేళ ఖమ్మం నుంచి ట్రాక్టరు ఎందుకు వచ్చిందని సమీప ప్రాంతాల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బెరైటిస్ రాళ్లను తరలించేందుకు వచ్చిన ఖమ్మం, మరిపెడకు చెందిన రెండు ట్రాక్టర్లను పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ పట్టుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. బెరైటిస్ రాళ్ల అక్రమ రవాణా జరుగు తుందనడానికి ఈ ఘటనలన్నీ నిదర్శనంగా నిలుస్తున్నాయి. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిధులతో సహ కొందరు నాయకులు క్షేత్ర స్థాయిలో బెరైటిస్ రాళ్ల నిల్వను పరిశీలించి అక్రమదార్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బెరైటిస్ రాళ్ల కుప్పలు

తెల్ల రాయి ఖనిజం ఉన్న గుట్ట ప్రాంతం

ఫారెస్ట్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలి
-మాలోత్ వెంకట్‌లాల్, మాజీ ఎంపిపి

బెరైటిస్ రాళ్లను అక్రమంగా తరలించకుండా అటవీశాఖ అధ్వర్యంలో ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసి, రెగ్యూలర్ వాచర్‌ను ఏర్పాటు చేసి తెల్ల రాళ్ల అక్రమ రవాణాను నియంత్రించాలి. అక్రమదారులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. ఇదే విషయం మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలి
-కందునూరి శ్రీనివాస్, సిపిఎం మండల కార్యదర్శి

కొన్నేండ్లుగా అక్రమార్కులు సంబంధిత శాఖల అధికారుల అండదండలతో రాత్రి వేళల్లో తెల్ల రాయి ఖనిజాన్ని యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తూ లక్షలు గడిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. రాయి తరలిస్తున్న వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నా.. పోలీసుశాఖకు అటవీ, రెవెన్యూ శాఖలు పూర్తిగా సహకరించి పూర్తి స్థాయిలో బెరైటిస్ అక్రమ రవాణాను నియంత్రించాలి.